క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించారు. మూలస్థానేశ్వరాలయ చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు శ్రీధర్, దార్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, ఇంతియాజ్, గోగుల నాగరాజు, మైనార్టీ నేతలు హాజీ, మున్వర్, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ధ్వజారోహణ, చప్పరోత్సవం, శేషవాహనసేవను వేడుకగా ఆదివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆలయ వ్యవస్థాపకులు వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి, గిరిజమ్మ దంపతులు, చెన్నైకి చెందిన విస్సా కశ్యప్, లలిత దంపతులు వ్యవహరించారు.

పుస్తకాల అందజేత



నెల్లూరు (టౌన్): బాలాజీనగర్‌లోని అంధుల పాఠశాలకు బియ్యం, పుస్తకాలు, పెన్నులను బీఈఎస్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఉచ్చి భార్గవ్‌రామ్ మాట్లాడారు. తమ సంస్థ ద్వారా ఉద్యోగావకాశాలు పొందిన పూర్వ విద్యార్థులు సాయం చేయడాన్ని అభినందించారు. సాఫ్ట్‌వేర్ నిపుణులు పూజిత, ఇమ్రాన్, ఉద్యోగులు షంషీర్, మోనీష్, మస్తాన్, తేజస్విని, అరుణ, అశ్విని, లాలస, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు ఉపయోగం



వైద్య శిబిరానికి హాజరైన అతిథులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో ఉపయోగమని సెంట్రల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ పరవస్తు నాగసాయిసూరి పేర్కొన్నారు. దర్గామిట్టలోని సెయింట్ జోసఫ్స్ నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని వియానీ హోమ్, పీఎంపీ అసోసియేషన్, భగవాన్ మహవీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్, అద్భుత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దాదాపు 450 మందికి వైద్య, రక్త పరీక్షలు చేసి మందులను అందచేశారు. అనంతరం ఉచిత భోజన సదుపాయాన్ని కల్పించారు. పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, వియానీ హోమ్ సిస్టర్ రూబియా, రూడ్స్ చైర్మన్ రసూల్, అద్భుత ఫౌండేషన్ నిర్వాహకులు సాల్మన్, కోరేష్, మహవీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు జవాన్మల్ జైన్, పీఎంపీలు వేణుగోపాల్, శేషయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: కలివెలపాళెంలో ఉచిత వైద్య శిబిరాన్ని వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. వైద్యులు అనన్య, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వీరరాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): వెంకటేశ్వరపురంలోని చేపల మార్కెట్ వద్ద వైద్య శిబిరాన్ని రోటరీ క్లబ్ నెల్లూరు ఆధ్వర్యంలో నిర్వహించారు. దాదాపు 52 మందిని పరీక్షించి మందులను అందజేశారు. వైద్యులు విజయలక్ష్మి, సాయివరుణ్‌రెడ్డి రోటరీ క్లబ్ నెల్లూరు అధ్యక్ష, కార్యదర్శులు కొండా శేఖర్‌రెడ్డి, సమీవుల్లా, మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, డైరెక్టర్ నాగరాజు, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కలివెలపాళెంలో..

జగనన్న కాలనీలో సంబరాలు



నెల్లూరు రూరల్: పీఎం ఆవాస్ యోజనను చేపట్టి ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భంగా వడ్డిపాళెంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులు, హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో సంబరాలను ఆదివారం నిర్వహించారు. నవరత్నాలు పథకంలో భాగంగా పేదలందరికీ ఇళ్లు అందడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ హౌసింగ్ డీఈ శ్రీహరిగోపాల్, ఏఈ మంజునాథ్, 18వ డివిజన్ కార్పొరేటర్ అశోక్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'నిధులు దుర్వినియోగం'

నెల్లూరు సిటీ: శ్రీవాణి ట్రస్ట్ నిధులను ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. భువనేశ్వరిప్రసాద్, పార్టీ నేత సుధ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ సమావేశం



డాక్టర్ రాజశేఖర్‌కు సత్కారం

నెల్లూరు(బృందావనం): ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆచారివీధిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నేత్రవైద్య నిపుణుడు రాజశేఖర్ హాజరయ్యారు. కంటి రెటీనా, శస్త్ర చికిత్సలు, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం రాజశేఖర్, జూన్‌లో జన్మదినాన్ని జరుపుకొంటున్న సభ్యులను సత్కరించారు. తొలుత భగవద్గీతను పఠించారు. అసోసియేషన్ నెల్లూరు అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, కార్యదర్శి చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దెపల్లి సుబ్బారావు, సీనియర్ సభ్యులు వెంకటేశ్వర్లు, శేషయ్య, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నెల్లూరు(బృందావనం): ఏవీకే ఫౌండేషన్ వార్షికోత్సవ వేడుకలను నగరంలోని పురమందిరంలో ఆదివారం నిర్వహించారు. తొలుత న్యూ రాజ్యలక్ష్మీ హాల్, శుభమస్తు షాపింగ్ మాల్ వ్యవస్థాపకులు బయ్యా వెంకటరమణయ్య, సరోజనమ్మను స్మరిస్తూ కళానీరాజనాన్ని నిర్వాహకుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో సమర్పించారు. పాటలు, నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. తెలుగు భాషకు ఎనలేని సేవలందిస్తున్న పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్‌ను సత్కరించి కళాపోషకుడు బిరుదును ప్రదానం చేశారు. ప్రవీణ్ డ్యాన్స్ అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. బాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సంగీత విభావరిని నిర్వహించారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, మాజీ కౌన్సిలర్ లలితారామ్, బలరామయ్యనాయుడు, ప్రదీప్, రియాజ్‌బాషా, రవికుమార్, మురళీకృష్ణ, సత్యం రవికుమార్, రఘురామిరెడ్డి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

16న ప్రతిభ పురస్కారాల ప్రదానం

నెల్లూరు రూరల్: శాలివాహన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అంబాపురంలోని శాలివాహన కల్యాణ మండపంలో జూలై 16న అందజేయనున్నామని సంఘ జిల్లా కమిటీ సభ్యుడు నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చాటిన శాలివాహన విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసపత్రాలను అందజేయనున్నామని వివరించారు. పదో తరగతిలో 480, ఇంటర్మీడియట్‌లో 800కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ట్రంక్‌రోడ్డులోని మయూరి హోటల్ ఎదురుగా గల ఆర్కే ప్రింట్ పాయింట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఆహార పొట్లాల పంపిణీ



నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ప్రాంతాల్లో పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు ఆహార పొట్లాలను జీఆర్ మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. సుగుణారెడ్డి, అరుణ, పద్మావతి, శైలజ, రమాదేవి, అనూష, రజని, స్వప్న, శ్రుతి, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

వెంకటాచలం: మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని సెబ్ నెల్లూరు-2 సీఐ వీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సెబ్ నెల్లూరు-2 ఆధ్వర్యంలో చెముడుగుంటలోని నారాయణ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై ఆదివారం అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి దూరంగా ఉండాలని సీఐ సూచించారు. ఈ సదస్సులో ఎస్ఐ శకుంతలదేవి, కళాశాల ప్రిన్సిపల్ విశ్వజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.